# శాంతిశ్రీ

శాంతిశ్రీ మంచివాడు. ఎవరికీ అన్యాయం చెయ్యడు. తనకు తోస్తే ఒకరికింత పెడతాడు. అయితే ఈ తోచడమనేది చాలా చిక్కయిన విషయమే అనుకోండి! అతనికి ముష్టివాళ్ళంటే ఎంతో ప్రేమ. వాళ్ళ కష్టసుఖాలను అతనెప్పుడూ తెలుసుకున్న పాపాన పోకపోయినా, వాళ్ళంటే అతనికి ఎక్కడలేని జాలీ ఉంది.

నలుగురు మిత్రులతో కలిసి అతను మాట్లాడేప్పుడు అతనెప్పుడూ పేదవాళ్ళప్రసక్తే తీసుకొస్తాడు. పేదవాళ్ళమీద అతనికెంతో అభిమానమున్నట్లు ఆ మిత్రులనుకోవాలని అతను ఆశపడతాడు. అందుకనే అనుకోండి మరెందుకైనా అనుకోండి, అతనా ప్రియమిత్రులున్నప్పుడు తప్పకుండా కానీలు, అణాలు పేదవాళ్ళకు దానం చేస్తూ ఉంటాడు. అలా చేస్తున్నప్పుడు ఆ మిత్రులవైపు ఒకసారి చూసిమరీ ఆ డబ్బులు ఆ పేదల ముఖాన విసిరేస్తాడు.

అప్పుడప్పుడా స్నేహితులతో, "ఒరే... నా ముఖాన ఏమైనా రాసివుందేమిట్రా... ఎప్పుడూ వాళ్ళు నన్నే అడుగుతారు" అంటూ తన ముఖాన గంభీరమైన ముద్ర కొట్టుకొని, తనను ఏ ఒక్క స్నేహితుడైనా ప్రశంసిస్తాడేమోనని ఎదురు చూస్తాడు. పాపం! ఆ స్నేహితులు అట్లాంటి పని ఎప్పుడూ చెయ్యరు.

ఆ మిత్రులంతా శాంతిశ్రీఅంత సద్గుణాలు కలవారు కారు. అదేమిటోగానీ వాళ్ళు ఇతరులలోని మంచిని సుతరామూ సహించలేరు. కాని ఆ ఇతరులలో బోలెడంత దుర్గుణాల చెత్త చేరి, అది కుళ్ళి కంపుకొడుతూంటే, ఆ గాలి పోగేసుకొని హుక్కాలా పీల్చడం, ఆ మిత్రబృందానికి ఎంతో యిష్టం!

శాంతిశ్రీ దానధర్మాలు చేయడం వాళ్ళకుససేమీ గిట్టదు. ఈ శాంతిశ్రీ అనే దుర్మార్గుడు తమను ఆ ముష్టి పీనుగుల ముందు అవమానపరుస్తున్నట్లుగా వారు ఊహిస్తారు. వాళ్ళ ఉద్దేశం, శాంతిశ్రీ కాదు కదా... అతని ప్రపితామహశ్రీయైనా

తామండగా ఎవడికీ కానీలు గీనీలు వెయ్యాగూడదని.

పాపం శాంతిశ్రీమాత్రం ఏమి చెయ్యగలడు? అతను పేదవాళ్ళకు డబ్బు వెయ్యడం మాత్రం మానలేడు. అది అతనికి చిన్నప్పటినుంచీ ఉన్న అలవాటు. ఆ అలవాటు ఇప్పుడు పొమ్మంటేమాత్రం పోతుందా ఏమిటి? కాని చిక్కంతా అతనీ అలవాటును, తనకు ఆత్మగతంగా లేని పేదల పట్ల సానుభూతిగా జమకట్టుకుంటాడు. ఇదే అతనితో వచ్చిన చిక్కు!

ఏ బిచ్చగాడైనా కానీ అడిగినప్పుడు మిత్రులెవ్వరూ తన దగ్గర లేకపోతే అతనెంతో బాధ పడతాడు. తను ఎలాగూ కానీ వెయ్యక తప్పదు. అటువంటప్పుడు ఆ మిత్రులు లేకపోవడం ఎంత బాధగా ఉంటుంది! అందుకనే, అతనాసమయంలో బిచ్చగాడికి కానీ వెయ్యడం మానడుగాని, ముఖం మాత్రం ఆముదం తాగిన వాడిలా పెడతాడు. ఇందుకనే అతను అప్పుడప్పుడు తను కానీలు ఈ వెధవ ముష్టివాళ్ళ కెందుకెయ్యాలేమిటి అనుకుంటాడు. తను కానీలు పోగొట్టుకోవడమే కాకుండా దానితో పుట్టెడు దుఃఖాన్నికూడా కొనితెచ్చుకోవడ మేమిటని మనసులో తెగనలిగి పోతాడు. 'ఈ ముష్టి వాళ్ళంతా తన స్నేహితులంతా తన వద్ద ఉన్నప్పుడే డబ్బులడుక్కోరాదూ'... అని ఎంతో ఇదౌతాడు.

"ఓయి శాంతిశ్రీ... ఎందుకయ్యా నువ్వు ఆ మిత్రుల గురించి అంత తాపత్రయం పడతావు. వాళ్ళు నిన్ను ఎప్పుడూ కించిత్తయినా పొగడిన పాపాన పోలేదు. వాళ్ళు ఉండడం కన్నా లేకపోవడం మంచిదికదూ...' అంటుంది అప్పుడప్పుడాతని మనసు. అయితే ఆ మిత్రుల్లు శాంతిశ్రీని అలాంటి సమయంలో పొగడకపోయినా వాళ్ళకవసరమైనప్పుడు అతనిని ఆకాశానికెత్తడంలో ఘనులే మరి.

అసలు బిచ్చగాళ్ళకు కానులు దానం చేసేప్పుడల్లా శాంతిశ్రీకి ఎక్కడలేని ఆనందంగా ఉంటుంది. ఆ సమయంలో మిత్రులున్నా ఉండకపోయినా, లోలోన అతని మనసుకెంతో శాంతిగా ఉంటుంది. ఎంతో హాయిగా ఉంటుంది.

ఈ "హాయి" అనేది, బిచ్చగాళ్ళకు డబ్బులిచ్చేప్పుడే కాదు; మిత్రులకు డబ్బు అప్పుగా ఇచ్చేప్పుడుకూడ కలుగుతుంది. వాళ్ళు తిరిగి ఇవ్వకపోతే బాధగా ఉంటున్నా... వారికి ఇచ్చేప్పుడు మాత్రం, ఎంతో సుఖంగా ఉంటుంది. అసలు శాంతిశ్రీ, తన మిత్రులెవరైనా తన వద్ద డబ్బు అప్పుగా పుచ్చుకుంటే బాగుండునని ఊహించిన దినాలు కూడా కొన్ని ఉన్నాయంటే చాలా మందికి ఆశ్చర్యం కలగొచ్చు!

శాంతిశ్రీ ఎవరికైనా అప్పు ఇవ్వడమంటే ఇచ్చేవాడేగాని, వాళ్ళ దగ్గర వడ్డీగిడ్డీ

పుచ్చుకోవడం లాంటి వెధవపని ఎప్పుడూ చెయ్యలేదు. వడ్డీలు పుచ్చుకోవడమంటే అతనికి పరమ అసహ్యం. అలాంటి వాళ్ళను చూస్తే అతనికి మాచెడ్డ రోత. ఉంటే ఇవ్వాలి, లేకపోతే మానెయ్యాలిగాని, వడ్డీ పుచ్చుకోవడం లాంటి నీచస్థితికి దిగజారకూడదని అతని మనసులోని కోరిక. మన దగ్గర ఉన్న వార్తాపత్రికను, ఒకసారి చదివి ఇస్తామంటే, ఎలా ఇస్తూ ఉంటామో... అలాగే మనదగ్గర ఉన్న డబ్బు వాళ్ల అవసరం తీరిన తరువాత, ఇస్తామంటే తప్పకుండా ఇవ్వాలంటాడు. ఇలాంటి చక్కని ఛిలుక పలుకులైతే అతను పలుకుతున్నాడే గాని, తీరా డబ్బు ఇవ్వడమనేది వచ్చేప్పటికి, మనుషుల కష్టాలను గుర్తించలేని అశక్తుడైపోతున్నాడు.

డబ్బు ఇస్తే తిరిగి వచ్చే మార్గాన్నే చూసుకుంటున్నాడు గాని, అది అవసరమైన వాళ్ళకే ఇస్తున్నానా లేదా... అనే ఆత్మవిమర్శకు దిగడం లేదు.

అసలు, అన్న ప్రకారంగా డబ్బు తిరిగి ఇచ్చేసే వాడికే, శాంతిశ్రీ అప్పు పెడుతూ ఉంటాడు. అయితే ముందుగా ఈ విషయం అతనికెలా తెలుస్తుందని ఎవరైనా అడగొచ్చు. కాని అతనీ విషయంలో గట్టివాడనే చెప్పాలి. పుచ్చుకొనేవాడి తాహతు ఎటువంటిదో, వాడినడవడి ఎట్లాంటిదో, అతని మాటలవెనుక ఎట్లాంటి అర్థాలు దాగి ఉన్నాయో, అతను ఇట్టే పసిగట్టగలడు. ఏతావాతా ఒకటి రెండు పద్దులు బీరుపోయినా, అటువంటి వాటిగురించి, అంతగా పట్టించుకోడు. మనసు కట్లాంటి సమయంలో కొంచెం బాధగానే ఉంటుంది గాని అట్లా బాధకలిగినప్పుడల్లా, ముష్టివాళ్ళకు పారేసిన డబ్బులతో జత చేసుకొని, ఆ ఎగేసిన బాపతునంతా ముష్టివాళ్ళకింద జమకట్టుకోవడంతో అట్లాంటి బాధల నుండి విముక్తుడౌతున్నాడు. మనసులో ఎంతో శాంతిని పొందుతున్నాడు.

శాంతిశ్రీ ఎక్కువగా చదువుకోకపోయినా, ఎక్కువగా ఆలోచిస్తాడు. ఎక్కువగా సినిమాలు చూడకపోయినా, ఎక్కువగా సినిమా పుస్తకాలు చదువుతాడు. సిగరెట్లు తాగకపోవడంవల్ల, కాఫీ వగైరా ఖర్చులు ఏమీ లేకపోవడంవల్ల, అతను అప్పులు ఇవ్వగా తిరిగి రానిడబ్బు ఇట్లాంటి దుర్వ్యసనాలకు ఖర్చయిపోయినట్లు భావించుకోడంలో తప్పేమిటి అనుకుంటాడు. పోయిన డబ్బు పోతే పోయింది గాని, చక్కని గుణపాఠం నేర్పిందని మనసులో ఆ పాఠాలను వల్లె వేసుకుంటాడు. గురువుగారు ఎంతో మనసు పెట్టి చెప్పిన విద్య కూడా రాణిస్తుందో రాణించదో తెలియదు కాని, అట్లా ఎవరూ చెప్పకుండానే డబ్బు పోతే కలిగే జ్ఞానం భాసిస్తుంది అంటాడు. ఇలాగే ఇలాగే అతనెప్పుడూ ఆలోచిస్తాడు.

ఆ రోజున అతను ఇంటికి వచ్చిన సమయాన, అతని అర్ధాంగి, శ్రీకాంత ఎవరితోనో ఒక ముసలమ్మతో మాట్లాడుతూండటం చూశాడు. అతను ఆమెను ఎవరో ముష్టికొచ్చిన ముసలమ్మ అనుకున్నాడు. ముష్టివాళ్ళకు ముష్టివేయడంలో తనకు శ్రీకాంత పోటీగా వస్తుందా ఏమిటి అన్న చల్లని ఊహ ఒకటి అతని మనసులో పుట్టి, అది హుషారుగా ఎంతో చల్లని పానీయంలా అతని హృదయానికి చల్లదనాన్ని చేకూర్చింది. అప్పుడప్పుడు తనకు పోటీ వచ్చే దాతలను చూస్తున్నప్పుడు గాని, అట్లాంటి వాళ్ళ కథలు వింటూన్నప్పుడు కాని, అతని గుండెల్లో భగ్గుమనేది. కాని అది శ్రీకాంత విషయంలో అలా భగ్గుమనక పోవడమే కాకుండా పైపెచ్చు ఎంతో చల్లగా ఉంది. ఏదో వేళా విశేషమనుకున్నాడు. కాదు... కాదు... అన్నట్లు మరచి పోయాను. ఆమె మరి అర్ధాంగి కదూ... అనుకున్నాడు. నవ్వుకున్నాడు.

కాని ఆ ముసలమ్మ ఎప్పటికీ ఆ పెరటిగుమ్మం దగ్గర నుండి కదలి వెళ్ళకపోవడం, ఎప్పటికీ శ్రీకాంత అక్కడనుంచి లోనికి కదలి రాకపోవడం చూస్తూ ఉంటే శాంతిశ్రీకి, శ్రీకాంత మీద పుట్టెడు కోపం పుట్టుకొచ్చింది. కాని అతని కోపం శ్రీకాంత మీద ఎందుకు పనికొస్తుంది? పాపం బలవంతాన అతనాకోపాన్ని అణచి, అలా దాన్ని అణచివేయడం మహాపాపంలా గిలగిలా కొట్టుకున్నాడు.

ఇంతలో శ్రీకాంత లోనికి రానేవచ్చింది. వచ్చిన ఆమె నవ్వుతూ రాలేదు. నవ్వుతూ వస్తే ఎలాగుండేదో కాని, ఆమె ముఖం ముడుచుకొని వచ్చింది. ముఖంలో ఏదో దాచి ముడివేసుకుని వచ్చింది. శాంతిశ్రీ గుండె పరిశోధిస్తూన్నట్లు కళ్ళు పెట్టింది. ఏదో చెప్పాలనుకొని చెప్పడం మానేసింది.

శాంతిశ్రీకి విసుగు వచ్చింది. విసుగు రావడం అంటే, ఎండలో మలమల మాడిపోయే ఇసుక ఎడారి ఒకటి చక్కా అతనిలో పుట్టుకొని రావడమన్నమాట! అందులో చికాకు తుఫానులు మరీ వీచాయంటే ఓ పట్టాన బయటపడటం కష్టం! చికాకంటే శాంతిశ్రీకి చెడ్డ అసహ్యం. అసహ్యమే కాదు భయం కూడాను. అందుకనే వెంటనే "ఏమిటి విశేషం?" అన్నాడు. అలా అంటూ, చల్లని గాలిలో హాయిగా కిలకిలలాడే పచ్చని ఆకుమడిలా ముఖాన్ని నవ్వులతో డెకరేట్ చేశాడు పాపం!

కాని శ్రీకాంత ఉలకలేదు పలకలేదు. ఆమె తిరిగి అలాగే చూసింది.

శాంతిశ్రీకి కోపం వచ్చేసేట్లుగా ఉంది. ఏదో గుండె లోపలినుంచి తరుముకొస్తూన్నట్లుంది. ఆ ముసలమ్మ ఇంకా ఆ పెరటి గుమ్మం దగ్గరనుంచి కదలిపోనేలేదు. దెయ్యంలా అక్కడే నిలబడి ఉంది.

"ఏమిటి కాంతా... ఎవరా మనిషి?" అన్నాడు. ఎంతణచుకున్నా కోపం మాటల్లో కలిసింది,పాలు అమ్మేవాడి పాలల్లో నీళ్ళు కలపబడకుండా ఉండనట్లు!

శ్రీకాంత పాపం భర్తంటే భయంలేనిది కాదు. ఏ విషయంలోనైనా, భర్తతో ఉల్లాసంగా మాట్లాడగలదేమో కాని, డబ్బు విషయమై అతని ముందు తిన్నగా నిలబడి మాట్లాడలేదు. అయినా పాపం తప్పనిసరైనట్లు "అబ్బే. ఏమీ లేదండి... వాళ్ళ అమ్మాయిని ఇవ్వాళ ఎవరో చూడటానికి వస్తారటండీ. చేతిలో చిల్లిగవ్వ లేదట. ఓ పది రూపాయలు సర్దుబాటు చెయ్యమంటోంది. నెలకు అర్ధణా వడ్డీ ఇస్తానని తెగ బతిమాలుతోంది. ఒక్క నెల రోజుల్లో ఇచ్చేస్తుందట..." అంటూ భర్తవైపు చూసింది. మీరు తప్పకుండా ఇవ్వాలన్నట్టుగా ముఖంలో భావాలనుమలచింది.

కాని శ్రీకాంత చెప్పిన ఈ మాటలు శాంతిశ్రీ, శాంతంగా వినలేకపోయాడు. శ్రీకాంతకు మతిపోయిందా అనుకున్నాడు. తన సంగతి పూర్తిగా తెలిసిఉన్న శ్రీకాంత ఇలా వడ్డీకి డబ్బు ఇమ్మని అడగటం సహించలేకపోయాడు. వెంటనే గట్టిగా, "అయితే నేను డబ్బు వడ్డీలకు తిప్పే వెధవననుకున్నావా?" అని అరిచాడు. "ఇప్పుడంటే అన్నావుగాని, ఇంకెప్పుడూ ఇలాంటి మాటలనకు" అంటూ ముక్కుపుటాలెగరేశాడు. ఇంక నువ్వు నోరెత్తక, శీఘ్రమే ఆ ముసలమ్మను ఇక్కడి నుంచి దయచెయ్యమని చెప్పు అన్నట్లుగా హూంకరించాడు.

పాపం ఆ ముసలమ్మ దీనావస్థకు ఎంతో జాలిపడిన శ్రీకాంత, పది రూపాయలు కూడా ఇవ్వలేక పోయిందే ఈ శ్రీమంతుల ఇంటి ఇల్లాలు అని అనుకుంటుందేమో అని దిగులుపడిన శ్రీకాంత, "పోనీ వడ్డీలేకుండానే ఇవ్వండి" అంది మెల్లగా.

శాంతిశ్రీకి చిర్రెత్తింది. " ఏమిటీ ముష్టిముండకు పది రూపాయలిమ్మంటావా. నీకేమైనా మతిపోయిందా ఏం? వెళ్ళు, ఇంకెప్పుడూ ఈ గుమ్మం తొక్కవద్దని చెప్పు. నీకంతగా చెప్పడానికి సిగ్గుగా ఉంటే నేనే వెళ్ళి చెప్తుతా" అంటూ ఆయాస పడిపోయాడు.

శ్రీకాంత చేసేది లేక, అక్కడ నుంచి ఆ ముసలమ్మకు వెళ్ళిపొమ్మని చెప్పలేక చెప్పింది. ఆమె వెళ్ళిపోయిన తరువాత శ్రీకాంతకేమిటో పిచ్చి ధైర్యం వచ్చింది. ఒకరిని ఏమైనా అనాలంటే వారిదగ్గర ఏరూపేణా సహాయం పొందనప్పుడే వీలుగా ఉంటుంది కాబోలు! ఈ భర్తగారు ఇంక ఎలాగూ డబ్బు ఇచ్చేది లేదు కాబట్టి, ఇప్పుడేమి మాట్లాడినా నోరు మెదపకుండా ఊరుకుంటారని నిర్ణయించుకుంది. ఇప్పుడే నాలుగు మాటలూ అడిగి అతన్ని దులిపేయాలనుకుంది. బట్టలు

మార్చుకునిరానీ అని ముందు గదిలో ఎదురు చూస్తూ నుంచుంది.

ఇంతలో ప్రక్కింటి షావుకారు మంగయ్య గారబ్బాయి గబగబా ఆ గదిలోకి వచ్చి, "మావయ్యా.. మావయ్యా... మా నాన్నేమో... మరేమో... పది రూపాయలుంటే ఇమ్మన్నాడు. రేపు నీకు ఇచ్చేస్తాడంట" అంటూ వగరుస్తూ నిలబడ్డాడు. అప్పుడు శాంతిశ్రీ, 'ఓరినీ ఈ నాలుగు మాటలకే ఇంత ఆయాపసడతావేంరా ' అంటూ వాడి బుగ్గగిల్లి, పది రూపాయల కాగితం తెచ్చి వాడిచేతిలో పెట్టాడు.

ఇప్పుడు శాంతిశ్రీని చూడటానికి కూడా, శ్రీకాంత అసహ్యించుకుంది. ఆమె ముఖంలో కోపం నిప్పు మీద ఉప్పులా పేలుతోంది. ఛీ అనుకుంటూ ఆమె తన గదిలోకి అతనితో ఏమీ మాట్లాడకుండా విసురుగా వెళ్లిపోయింది.

ఆమె వెనుకనే శాంతిశ్రీ వెళ్ళి మెల్లగా, "అయితే నువ్వు, ఆ బికారిని, ఈ షావుకారును ఒకే త్రాసులో తూస్తావా?" అన్నాడు.

కాని శ్రీకాంత మాట్లాడలేదు. శాంతిశ్రీకి ఆమె నోటి వెంట జవాబు తన కనుకూలంగా చెప్పించుకోవాలనే ఆదుర్దా అధికమయింది. అందుకని, పాప మతను ఆమె చుట్టూ తిరిగాడు. తనలో తాను తిరిగి చూసుకోకుండా, ఆమె చుట్టూ తిరగడం వల్ల తను ఆశించిన విధంగా ఫలితం ఉండదని అతను ఊహించ లేకపోయాడు. "ఎందుకు కాంతా అంత కోపం" అన్నాడు. అలా అన్నప్పుడు ఏమి జవాబు వినవలసి వస్తుందో అని భయపడ్డాడు. శ్రీకాంత కోరిక నెరవేర్చకపోవడంవల్ల తను ఆమెకు ఈ విధంగా లొంగిపోవలసి వచ్చింది కదా అని మనసులో బహుకష్టపడ్డాడు.

అప్పటి వరకు శ్రీకాంత, పాపం అతిప్రయత్నం మీద అణచుకున్న కోపం అంతా ఒక్కసారి ఆమె గుండెల్లోంచి పెల్లుబికింది. ఆమె మాటలు తడబడ్డాయి. 'ఎందుకా' అంటూ వికటంగా నవ్వింది. నవ్వి, 'మీ తెలివికి' అంది కఠినంగా.

తన తెలివి కేమివచ్చిందో అర్థం కాని శాంతిశ్రీ " ఏం" అన్నాడు అయోమయంగా.

" ఏమాఁ మీకింకా అర్థం కాలేదూ" అంది.

"తిన్నగా చెప్పగూడదూ" అన్నాడు అతను.

"డబ్బుందంటేనూ ఆశయాలున్నాయంటేనూ అయిపోలేదు" శ్రీకాంత ఎదురు తిరిగింది. ఏదో గొప్ప అపరాధాన్ని బయటపెట్టే ధోరణిలో మాటలు సానబడ్తూంది.

శాంతిశ్రీ హృదయం దెబ్బతింది. " ఏం... ఇప్పుడేం వచ్చింది.నేను ఛస్తే ఎప్పుడూ ఎవ్వరికీ డబ్బు వడ్డీకివ్వను, వడ్డీకివ్వనప్పుడు, అది తిన్నగా తిరిగివచ్చే మార్గం చూసుకోవడం తప్పా? ఎవరితోనైనా చెప్పించు" గట్టిగా దెబ్బ కొట్టాననుకున్నాడు.

శ్రీకాంత ఇక నోరెత్త లేదనుకున్నాడు. కాని శ్రీకాంత ఎట్లా ఊరుకుంటుంది?

"ఇప్పుడు కళ్లార చూసింది అర్థం కాలేదు కాని, ఎవరో చెప్తే అర్థమవుతుందట. హు..." చీదరించుకుంది శాంతిశ్రీ గుండె శ్రీకాంత పిడికిలిలో ఇరుక్కుపోయింది.

"తిన్నగా చెప్పగూడదూ ఎందుకలా డొంకతిరుగుడుగా మాట్లాడుతావు" ప్రాధేయపడ్డాడు. ఆమె తన గొప్పదనాన్ని అణచివేయ చూస్తోందని వింతగా తలపోశాడు. తన గొప్పతనం ఆమెకొక సారి జ్ఞాపకం చేస్తేగాని లాభం లేదనుకున్నాడు. "నామట్టుకు నాకు పేదవాళ్ళంటే ఎంతో జాలి ఉంది. ఆ ముసలమ్మకు, ఓ రూపాయో అర్థో సహాయం చేయడానికి నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు ఇక తృప్తి పడుతుందనుకున్నాడు. ఇక గొడవ సమసిపోతుందనుకున్నాడు.

కాని శ్రీకాంత ఊరుకోలేదు. శ్రీకాంత తక్కువది కాదు. 'మీ ముష్టి ఆలోచనలు మాత్రం పోనిచ్చుకున్నారు కాదు.' విసురుగా అంది.

శాంతిశ్రీ ఒక్కసారి ఉగ్రుడైపోయాడు. భార్యనన్న విషయం కూడ మరచిపోయి మాట్లాడేస్తూంది. 'ఏం తలతిరుగుతూందా?' అరిచాడు.

"ఆఁ... తలే తిరుగుతూంది. ఆ మంగయ్యకున్నంత జాలైనా మీకు లేదని తెలుసుకున్నందుకు మరి తలతిరగకేమౌతుంది?"

అన్యాయం! అన్యాయం!! ఎంత చులకనగా తీసి పారేస్తోంది. అందులో తనను ఆ మంగయ్య కన్నా హీనంగా... పిల్లికి బిచ్చం పెట్టని ఆ పిసినిగొట్టుకన్నా... "కాంతా ఎందుకింత అన్యాయంగా మాట్లాడుతావు. నువ్వు చేస్తున్నది తప్పుసుమా... తరువాత పశ్చాత్తాప పడతావు..." శాంతిశ్రీ మనసు ప్రియసఖి కేమిటో బోధపరుస్తూంది.

"అర్థణా వడ్డీకివ్వకపోతే ఇవ్వకపోయాడు. అణా వడ్డీకేనా ఇస్తాడు. అవసరానికాదుకోలేని అర్థంలేని మీ జాలిగుండెకన్నా... అతనే నయం" సూటిగా చెప్పింది.

"అయితే వాడు చేసే తుచ్ఛమైన హేయమైన పనే... నన్నూ చేయమంటావా?" శాంతిశ్రీ ఒక్కసారి మండిపడ్డాడు.

భర్త అమాయకతకు శ్రీకాంత ఎంతో జాలిపడింది. అతని తెలివి తక్కువ తనానికి సిగ్గుపడింది. ఎగతాళిగా ఫక్కున నవ్వింది. "అయ్యో రామాఁ... మీకింకా అర్థం కాదేం. ఇప్పుడు మీ దగ్గర తీసుకున్న డబ్బు ఎవ్వరికిచ్చేదనుకుంటున్నారు?" ఆమె అదోలా నవ్వుతూ అంది.

ఆ మాట ఒక్కసారి పాపం శాంతిశ్రీ తలకు రివ్వున రాయిలా వచ్చి తగిలింది.

"ఆఁ... ఏమిటీ" అంటూ అతను విస్తుపోయాడు. అంతే. అతని నోట మరోమాట పెగిలిరాలేదు. అతని కళ్ళల్లో ఏదో ఆవేదన అలముకుంది. ముఖంలో పశ్చాత్తాపపు రేఖలు పొరాడుతున్నాయి.

"బాధపడకండి... ఆ ముసలమ్మ ఇచ్చిన మరునాడే... అతనికి తోస్తే ఇచ్చేస్తాడు లెండి. ఎక్కడికీ పోదుగా..." శ్రీకాంత ఇంకా నవ్వుతోంది. అబ్బ! ఆమె అతని గుండెల్ని ఎలా కెలుకుతోంది!

పాపం శాంతిశ్రీ హృదయానికి ఇంతటి అశాంతి ఎప్పుడూ కలగలేదు. అతనలాగే శ్రీకాంత వైపు చూస్తూ జాలిగా కరిగిపోతున్నాడు.

(తెలుగు స్వతంత్ర 29-7-1955)